# లాభాలను ఆర్జించే మార్గమిదే

**పెట్టుబడులకు ప్రాణం వైవిధ్యం. నష్టాలు పరిమితం చేసుకొని, రాబడిని ఆర్జించాలంటే.. సొమ్మును ఒకేచోట అట్టిపెడితే కుదరదు. స్టాక్ మార్కెట్లో లాభాలను ఆర్జించడానికి ప్రాథమిక సూత్రం కూడా ఇదే.**



సతీష్ కంతేటి
జెన్ మని

నష్టభయాన్ని పరిమితం చేసుకోవడానికి పెట్టుబడులో వైవిధ్యం ఉండాలన్న విషయం మనం ఎప్పటినుంచో వింటున్నదే. అందుబాటులో ఉన్న అన్ని మదుపు సాధనాలకూ మన కష్టార్జితాన్ని కేటాయిస్తే.. ఎలాంటి ప్రతికూల పరిస్థితులనైనా తట్టుకోవచ్చునేది ఇప్పటికే నిరూపితమైన విషయం. షేర్ మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టి, లాభాలు కళ్లజూడాలనుకునే వారికి, ముఖ్యంగా మార్కెట్ వృద్ధి చెందుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో ఇది ఎంతో కీలకమైనది. ఇలాంటప్పుడు మనం పెట్టే పెట్టుబడుల్లో పలు షేర్లకు, రంగాలకు ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంటుంది. అప్పుడే మార్కెట్‌లో ప్రతికూల పరిస్థితులు ఏర్పడినప్పుడు కూడా మన సొమ్ముకు పెద్దగా నష్టం వాటిల్లదు.

## ఆకర్షణీయమే! అయినా..

ఒకసారి 1999-2000 మధ్య కాలాన్ని పరిశీలిద్దాం. ఆ సమయంలో చాలామంది ఐటీ, కమ్యూనికేషన్, ఎంటర్‌టైన్‌మెంట్ షేర్లలో ఎక్కువగా మదుపు చేశారు. మార్కెట్ తగ్గుతున్నపుడు ఈ రంగాల్లోని షేర్లలో పెట్టుబడులు కూడా కరిగిపోయాయి. 2004-2008 కాలాన్ని పరిశీలిస్తే చాలామంది మదుపర్లు స్థిరాస్తి, నిర్మాణం, విద్యుత్ కంపెనీల షేర్లను అధిక ధరల వద్ద కొన్నారు. తర్వాత జరిగిన పరిణామాల నేపథ్యంలో వాటి ధరలు తగ్గడం.. ఏడాది కాలంగా మళ్లీ మార్కెట్‌కు మంచి రోజులు వచ్చినా వీటి ధరలు ఇంకా ఆ స్థాయికి చేరకపోవడం చూస్తూనే ఉన్నాం.

దీనికి ప్రధాన కారణం ఏమిటంటే.. మార్కెట్ పెరుగుతున్నప్పుడు ఏ రంగాల షేర్ల ధరలు వాస్తవ ధరను మించి అనూహ్య స్థాయుల ట్రేడ్ అవుతుంటే స్వల్పకాల దృక్పథంతో చాలామంది వాటి వైపే మొగ్గు చూపిస్తారు. అప్పటికప్పుడు ఆకర్షణీయంగా కనిపించే ఆ షేర్ల భవిష్యత్తు గురించి ఆలోచించరు. కేవలం రంగాలను నమ్ముకొని మదుపు చేసే విధానం వల్ల చాలాసార్లు నష్టాలు చవిచూసినా జరిగిన పొరపాటును గుర్తించరు. ఇప్పుడు ఫలానా రంగాలు బాగున్నాయి కాబట్టి, భవిష్యత్తులో కూడా అవే బాగుంటాయనే ధోరణి సరికాదనే విషయాన్ని గుర్తించాలి.




## ఒకే యాజమాన్యం

మార్కెట్లో ఉన్న అన్ని కంపెనీల పరిస్థితులూ ఎప్పుడూ ఒకేలా ఉండవు. ఒకే యాజమాన్యానికి చెందిన అన్ని కంపెనీల పనితీరూ ఒకేలా ఉండదు. కొన్ని లాభాలు ఆర్జిస్తే.. మరికొన్ని నష్టాలను మిగల్చవచ్చు. అందువల్ల ఒక సంస్థ మీద నమ్మకంతో మన మొత్తం సొమ్మును ఆ సంస్థకు చెందిన కంపెనీల్లోనే పెట్టుబడి పెట్టడం సరైంది కాదు. ఉదాహరణకు చాలామంది సత్యం సంస్థకు చెందిన సత్యం కంప్యూటర్స్, మైటాస్ ఇన్‌ఫ్రా కంపెనీల్లో అధిక మొత్తంలో పెట్టుబడులు పెట్టారు. యాజమాన్యం చేసిన మోసం కారణంగా వాళ్లంతా ఎంత నష్టపోయారో ప్రత్యక్షంగా చూశాం. అందుకే యాజమాన్యం మీద ఎంత నమ్మకం ఉన్నా.. ఆ కంపెనీలలోనే పెట్టుబడి పెడతామనేది సరైన పద్ధతి కాదు. బహుళజాతి సంస్థ అయినా.. ప్రభుత్వ రంగ సంస్థ అయినా ఇదే వర్తిస్తుంది.

✤ మార్కెట్ వృద్ధి పథంలో కొనసాగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో మీ మొత్తం పెట్టుబడుల్లో 15 నుంచి 20 శాతానికి మించి ఒకే రంగానికి కేటాయించకూడదు.

## షేర్లనూ చూడాలి

మదుపర్లు చేసే సాధారణ పొరపాటు.. తమ దగ్గరున్న సొమ్మంతా ఒకే షేరులో పెట్టేయడం. దీనివల్ల నష్ట భయాన్ని కోరి ఆహ్వానించినట్లే. ఎందుకంటే.. మార్కెట్ బాగున్నన్ని రోజులు ఆ షేరు పెరుగుతున్నా.. ఏ మాత్రం వ్యతిరేకంగా జరిగినా, కంపెనీ లాభార్జనలో, భవిష్యత్తు పనితీరులో తేడా వచ్చినా ప్రతికూల పరిస్థితులను ఎదుర్కోవాల్సి రావచ్చు.

✤ పరిశోధనల్లో తేలింది ఏమిటంటే.. ఎలాంటి మార్కెట్ పరిస్థితుల్లోనైనా ఒక షేరులో మీ దగ్గరున్న సొమ్ములో 8-12 శాతానికి మించి పెట్టకూడదు. అయితే, వైవిధ్యం కోసం ఎక్కువ షేర్లను కొనడమూ మంచిది కాదు. ఒక షేరుకు కనీసం 3-4 శాతానికి తక్కువ కాకుండా కేటాయించాలి. అంతకంటే చిన్న చిన్న మొత్తాలను ఒక్కో షేరుకు కేటాయించడం వల్ల మొత్తం పోర్ట్‌ఫోలియోకు ఆశించిన మేర ప్రయోజనం లభించదు.

✤ సగటు మదుపర్లు కొన్ని షేర్ల మీదే దృష్టి పెట్టడం కూడా సరికాదు. కంపెనీ గురించి ఎప్పటికప్పుడు పూర్తి వివరాలు తెలుసుకుంటూ ఉండే వారికి మాత్రమే ఇది సరిపోతుంది.

## సామర్థ్యం ఎంత?

ఒక్కో వ్యక్తి ఆర్థిక పరిస్థితి ఒక్కోలా ఉంటుంది. కాబట్టి, ఎవరికి వారే తాము ఎంత మేరకు నష్టభయాన్ని భరించగలమనే విషయాన్ని నిర్ణయించుకోవాలి. సంప్రదాయ మదుపరి క్రమం తప్పకుండా ఆదాయాన్ని అందించే షేర్లను ఎంచుకోవడం మేలు. నష్టాన్ని భరించే సామర్థ్యం ఉన్నవాళ్లు.. ఆర్థిక సౌష్ఠవం గల కంపెనీలతోపాటు కొంత మొత్తాన్ని ప్రస్తుతం అంత బాగా పనిచేయలేకున్నా, భవిష్యత్తులో బాగా పనిచేస్తాయని నమ్మకం ఉన్న షేర్లను అధిక రాబడికోసం ప్రయత్నించవచ్చు.

ఇవి కాకుండా.. పెట్టుబడుదారులు పరిగణనలోనికి తీసుకోవాల్సిన విషయాలు ఏమిటంటే..

✤ **వడ్డీ రేట్లు:** అప్పులు ఎక్కువగా ఉన్న కంపెనీలకు వడ్డీ రేట్లు పెరిగితే వాటి రాబడి క్షీణిస్తుంది. అందువల్ల వడ్డీ రేట్లలో తేడాలు వచ్చినా ఏ మాత్రం ప్రభావం పడని రంగాలను కొన్నింటిని ఎంచుకోవాలి.

✤ **నగదు విలువ:** ఎగుమతులు, దిగుమతుల మీద వ్యాపారం ఆధారపడే కంపెనీలకు కరెన్సీ విలువల్లో వచ్చే తేడాల వల్ల లాభనష్టాలు ప్రభావితం అవుతుంటాయి. అలాంటి కంపెనీల షేర్లలో పెట్టుబడి పెట్టేటప్పుడు కూడా కొంచెం జాగ్రత్తగా ఉండాలి.

✤ **నియంత్రణ సంస్థ:** ప్రభుత్వ నిర్ణయాలు, నియంత్రణా సంస్థల నిర్ణయాలు కూడా ఒక కంపెనీ పనితీరుపై ప్రభావం చూపవచ్చు. షేర్లలో పెట్టుబడి పెట్టేటప్పుడు ఇలాంటివి కూడా చూసుకోవాలి.

మార్కెట్‌పై పూర్తిస్థాయి అవగాహన లేనివారు, వైవిధ్యభరితమైన పోర్ట్‌ఫోలియోను నిర్మించుకోలేని వారు, సరైన తీరిక లేనివారు వైవిధ్యానికి పెద్ద పీట వేసే మంచి మ్యూచువల్ ఫండ్ పథకాలను ఎంచుకోవడం ప్రయోజనకరంగా ఉంటుంది.